www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 21 ఆగస్టు 2024 5 పశ్చిమ గోదావరి

వినతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : కలెక్టర్

భీమవరం: 'మీ కోసం' ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను అత్యంత అంకితభావంతో పరిష్కరించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్లడించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివిధ శాఖలలో 'మీకోసం' ఫిర్యాదులను పరిశీలించే విభాగాధిపతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులను జిల్లా అధికారులు స్వయంగా పరిశీలించి సరైన పరిష్కారాన్ని అందించాలని ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కారంలో నాణ్యత పెంచాలి, మీకోసం వినతుల పరిష్కారం ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించారు. ఈ విధంగా కొన్ని శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని ఇంకా మెరుగ్గా ఏవిధంగా పరిష్కరించవచ్చో తెలియజేశారు. ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతోపాటు ఎట్టి పరిస్థితుల్లో రీ ఓపెన్ కాని విధంగా పరిష్కారం జరగాలని ఆదేశించారు.

వైసిపి సారథి ఎవరు..!

జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని రాజీనామాతో శ్రేణుల్లో నిస్తేజం

కొత్త సారథి కోసం వైసిపి అధిష్టానం మల్లగుల్లాలు

కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు పేరు పరిశీలన

ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిపైనా కసరత్తు

ఎన్నికల్లో ఓటమితో ముఖం చాటేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వైసిపి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ప్రముఖ నాయకులంతా ఎన్నికల్లో ఓటమి తర్వాత బయటికి రాకుండా ముఖం చాటేస్తున్నారు. పశ్చిమ వైసిపిలో స్తబ్దత కొనసాగుతుండగా, ఏలూరు జిల్లాలో పరిస్థితి వైసిపి అధినాయకులను ఆందోళనకు గురిచేస్తోంది. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా ఉన్న ఆళ్ల నాని రాజీనామా ఆ పార్టీలో కలకలం రేపుతోంది. ఇప్పుడు వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎవరనే దానిపై తీవ్ర చర్చ సాగుతోంది. గతంలో అధ్యక్ష పదవి కోసం పెద్దఎత్తున నాయకులు పోటీపడేవారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో నాయకులు ఎవరూ జిల్లా అధ్యక్ష బాధ్యతలు తీసుకునేందుకు సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. దీంతో వైసిపి అధిష్టానం జిల్లా అధ్యక్ష పదవి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎవరిని నియమించాలనే దానిపై తీవ్రమైన కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా దాదాపు పదేళ్లుగా ఉన్న మాజీ మంత్రి ఆళ్ల నాని హఠాత్తుగా ఆ పదవికి రాజీనామా చేశారు. ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి సైతం రాజీనామా చేశారు. తాజాగా ఆ పార్టీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేయడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత రెండు జిల్లాల్లో వైసిపిలోని అగ్ర నాయకులు ఎవరూ బయట కనిపించడం లేదు. ఎటువంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. వరదలకు జిల్లాలో రైతులు పెద్దఎత్తున నష్టపోయినా వైసిపి నాయకులు ఎవరూ రైతుల వద్దకు వెళ్లి పరామర్శించిన పరిస్థితి కనిపించలేదు. నిన్నటి వరకూ మంత్రులుగా, ఎంఎల్‌ఎలుగా ఉన్న నాయకులు సైతం పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆళ్ల నాని రాజీనామా వైసిపి అధిష్టానాన్ని తీవ్ర కలవరపాటుకు గురి చేసిందని తెలుస్తోంది. నిస్తేజంగా ఉన్న పార్టీకి జిల్లా రథసారథిగా ఎవరిని నియమించాలనే దానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. ఏలూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ మేకా ప్రతాప్‌అప్పారావు వయస్సు రీత్యా అధ్యక్ష బాధ్యతలు కష్టమనే అభిప్రాయం ఉన్నట్లు చెబుతున్నారు. దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన స్థానికంగా ఉండటం లేదు. లండన్‌లోనే ఎక్కువగా ఉంటున్నారని సమాచారం. ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు ఇలా పలువురి పేర్లు పరిశీలన చేస్తున్నప్పటికీ సమర్థవంతంగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించే నాయకుడి కోసం అధిష్టానం చూస్తున్నట్లు చెబుతున్నారు. కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావును జిల్లా అధ్యక్షునిగా నియమించాలని వైసిపి అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఎంఎల్‌ఎ కావడంతోపాటు అందరినీ కలుపుకుని వెళ్లే స్వభావం నాగేశ్వరరావుకు ఉన్నట్లు భావిస్తున్నారని తెలుస్తోంది. ఆయనకు అధ్యక్ష పదవి ఇస్తారా.. మరో నాయకుడిని నియమిస్తారా వేచిచూడాల్సి ఉంది.

ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గంటా ప్రసాద్..?

ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఆళ్ల నాని తప్పుకోవడంతో ఆ స్థానం ఎవరితో భర్తీ చేయాలనే దానిపై అధిష్టానం ఆలోచిస్తోంది. పార్టీకి అండగా ఉండే శ్రీనివాస్, మంచెం మైబాబు వంటి నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. మేయర్ షేక్ నూర్జహాన్ భర్త పెదబాబు టిడిపికి దగ్గరైన పరిస్థితి ఉంది. దీంతో ఏలూరు నియోజకవర్గంలో వైసిపికి సమర్థులైన నాయకులు లేకుండా పోయారు. దీంతో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ భర్త ప్రసాద్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించాలనే యోచనలో వైసిపి అధినాయకత్వం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా భార్య పద్మశ్రీ ఉండటంతో ఆయన ఏలూరు నియోజకవర్గ బాధ్యతలు చేపడతారా అనే అనుమానాలూ ఉన్నాయి. ఇంకా దాదాపు రెండేళ్లపాటు ఛైర్‌పర్సన్ పదవీకాలం ఉంది. ఇప్పుడు వైసిపి నాయకునిగా కీలక పాత్ర పోషిస్తే జెడ్‌పి ఛైర్‌పర్సన్ పదవికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం గంటా ప్రసాద్ అనుచరుల్లో వ్యక్తమవుతోంది. మరో నాయకుడు ఎవరూ కనిపించకపోవడంతో వైసిపి అధిష్టానం కలవరం చెందుతున్నట్లు చెబుతున్నారు. వైసిపి అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందో వేచిచూడాలి.

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కృషి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మెరుగైన పారిశ్రామిక విధానం ప్రభుత్వం అమలు చేసేందుకు పారిశ్రామికవేత్తలు తమ సూచనలు సలహాలు అందించాలని కోరారు. కలెక్టరేట్లో మంగళవారం జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం 2024 - 29 నూతన పారిశ్రామిక విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. పరిశ్రమల స్థాపనకు అవకాశాన్ని పెంచడంతోపాటు, అవరోధాలను తొలగించడానికి కృషి చేస్తామన్నారు. పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులను నిర్ణీత కాల వ్యవధిలో సింగిల్ విండో పద్ధతిలో ఆమోదిస్తామని ప్రకటించారు. భూమికు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమను సంప్రదించాలని పారిశ్రామిక వేత్తలకు సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం ఎపిఐఐసికి కేటాయించిన స్థలాలను అభివృద్ధి చేసి, వీలైనంత వేగంగా పారిశ్రామిక వేత్తలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. ఆక్వా కల్చర్, టెక్స్‌టైల్ ఉత్పత్తుల ప్రతినిధులు, ఎంఎస్ఎంఇ పరిశ్రమల సంఘాల ప్రతినిధులు పారిశ్రామికంగా తమ ఎదుర్కొంటున్న సమస్యలు, సూచనలు, సలహాలు అందజేశారు. ముఖ్యంగా పరిశ్రమ కైనా విద్యుత్తు చాలా ప్రాముఖ్యమైందన్నారు. పరిశ్రమల మనుగడకు విద్యుత్తు సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, విద్యుత్ టారిఫ్ ఎంతో కీలకమని, ప్రస్తుత విద్యుత్ టారిఫ్, ట్రూ అప్ ఛార్జీలు చాలా ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వెంటనే పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ చెల్లించాలని, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం (ఎన్ఒసి) ఛార్జీలు నాలుగు రెట్లు పెంచారని, జిఎస్‌టి తగ్గించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ యు.మంగపతిరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నాగేంద్రప్రసాద్, జగదీష్ మెరైన్స్ ఎపిఐఐసి కె.బాబ్జి, ఐలా సొసైటీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రామకృష్ణ, ఆనంద్ వెల్కమ్ గ్రూప్స్, త్రీ ఎఫ్ ఇండస్ట్రీస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పని సర్దుబాటు లోపాలను సరిచేయాలి

ఇన్‌ఛార్జి డిఇఒకు జిల్లా ఫ్యాప్టో నేతల వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పాఠశాలల పని సర్దుబాటు లోపాలను తక్షణం సరిచేయాలని జిల్లా ఫ్యాప్టో నేతలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్లో ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఫ్యాప్టో ఛైర్మన్ ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమత్స సాయివర్మ, ఫ్యాప్టో సహాధ్యక్షులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుమత్స విజయరామరాజు, ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు ప్రకాష్, ఎపిటిఎఫ్ 1938 అధ్యక్షులు రమణ, రూప్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, ఎస్‌టియు అధ్యక్షులు గుత్తుల శ్రీనివాస్, ఎస్‌టి జిల్లా కార్యదర్శి మన్నే వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా కోసేధికారి పట్టాభిరామయ్య, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాంత్‌కుమార్ అందజేశారు. రూల్ యుడిఐసిని అనుసరించకుండా కొన్ని పాఠశాలలకు అటెండెడ్ యాప్ ప్రాతిపదికన తీసుకోవడం వల్ల కొందరు ఉపాధ్యాయులను మిగులుగా గుర్తించినట్లు తెలిపారు. అటువంటి వారిని మిగులు పోస్టుల నుంచి పాఠశాలలను పని సర్దుబాటు నుంచి మినహాయించాలని కోరారు. మున్సిపాల్టీలో ఎస్ఎలను, జిఎస్‌టిలను ఆయా మున్సిపాల్టీలో సర్దుబాటు చేస్తున్న తరువాత మిగిలిన పని సర్దుబాటు చేయాలన్నారు. వివిధ కేటగిరిల ఉపాధ్యాయులను మండల స్థాయిలోనే సర్దుబాటు చేయాలని కోరారు. పని సర్దుబాటు చేసేటప్పుడు సీనియర్స్‌కు అవకాశం ఇవ్వాలని, ఆ విధంగా చేయడానికి సాఫ్ట్‌వేర్ సహకరించకపోతే మాన్యువల్‌గా పేపర్ వర్క్ చేసి ఆ తర్వాత ఆన్‌లైన్ చేసే అవకాశం కల్పించాలన్నారు.



ఇన్‌ఛార్జి డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

శిక్షలను మరింత కఠినతరం చేయాలి

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నేతలు, మహిళలు డిమాండ్ చేస్తున్నారు. దేశంలో శిక్షలను కఠినతరం చేయాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు. వైద్యురాలిపై దాడిపై పలువురి మనోగతం..

ప్రజాశక్తి - భీమవరం

మమతా బెనర్జీ బాధ్యత వహించాలి

డి.కళ్యాణి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్

జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన కామాంధులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. నాన్ బెలబుల్ కేసులు పెట్టాలి. ఇటువంటి ఘటనలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పూర్తి బాధ్యత వహించాలి. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి. ఇతర దేశాల మాదిరి మనదేశంలో కూడా శిక్షలన్నీ కఠినతరం చేయాలి. మరొక్కసారి ఏ ఆడపిల్లకూ అన్యాయం జరగకుండా చూడాలి. మహిళలకు, యువతకు, చిన్నారులకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

మహిళలపై అఘాయిత్యాలు బాధాకరం

ఎస్.లారెన్స్ కుమారి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్

సమాజంలో మహిళల పట్ల వివక్ష కొనసాగడం దారుణం. ఎన్ని రక్షణ చట్టాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదు. ముఖ్యంగా మహిళలు పనిచేసే చోట రక్షణ లేకుండా పోయింది. మహిళలను ఆట బొమ్మలుగా నేటికీ చూడడం అత్యంత బాధాకరం. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఎందుకంత చిన్నచూపో అర్థం కాని పరిస్థితి. మహిళ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం హత్యను ప్రతి ఒక్కరూ ఖండించి ముందుకొచ్చి న్యాయం జరిగే వరకూ పోరాడాలి.

కలకత్తాలో ఘటన దారుణం..

డాక్టర్ డి ఆర్ స్వర్ణలత
సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపల్

కలకత్తాలోని మెడికల్ కళాశాలలో జరిగిన ఘటన అత్యంత దారుణం. జూనియర్ డాక్టర్‌పై సంజయ్‌రాయ్ మరి కొంతమంది కలిసి సామూహిక అత్యాచారం చేయడం అరాచకం. ఈ మధ్యకాలంలో ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇటువంటి ఘటనలపై స్పందించాలి. అరాచకాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి. దుర్మార్గులను వారికి సహకరించిన వారిని న్యాయస్థానాలు క్షమించకుండా తగు గుణపాఠం చెప్పాలి. ఎవరైనా ఇటువంటివి పాల్పడడానికి భయపడే విధంగా నడిరోడ్డుపై శిక్షించాలి.

ఆడపిల్లలను బయటకు పంపాలంటే భయమేస్తోంది

చిల్లా అనూష, సర్పంచి, పెన్నాడ అగ్రహారం

నేటి సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకపోవడం అత్యంత బాధాకరం. ఆడ పిల్లలను బయటకు పంపించాలంటేనే భయంకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వైద్యురాలిపై అత్యంత కిరాతకంగా హత్యాచారం దుర్మార్గం. మహిళలు పని చేసే చోట రక్షణ లేకపోవడమే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఉన్న చట్టాలను మరింత పటిష్టం చేయాలి. తప్పు చేసిన ప్రతి వ్యక్తికీ శిక్ష పడేలా న్యాయస్థానాలు చర్యలు చేపట్టాలి.

సోలార్ రూఫ్ టాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్ టాప్, వినియోగదారుల బిల్లులు చెల్లింపునకు ఏర్పాటుచేసిన ప్రచార సాధనాలను జిల్లా కలెక్టర్ పరిశీలించి, సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ విద్యుత్ పొదుపునకు సరైన మార్గం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవడమేనని తెలిపారు. ఇది ఎంతో లాభదాయకమైందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడానికి పెద్ద మొత్తంలో సబ్సిడీ కూడా అందుతుందని, ఏర్పాటు కూడా సులువైందని తెలిపారు. నానాటికీ పెరుగుతున్న విద్యుత్ బిల్లులతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని, సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అద్భుతమైన పథకాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఇంటి పైకప్పుపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకుని ఉచిత విద్యుత్ పొందడమే కాకుండా మిగుల విద్యుత్తును విక్రయించి ఆదాయం పొందొచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు WWW.pmsuryaghar.giv.in/ APEPDCL వెబ్ సైట్ ద్వారా PMSURYAGHAR పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కలెక్టర్ వెంట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్, డిఇఇ రాజగోపాల్ చౌదరి ఉన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ నిరసనలు

తణుకు: బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన తహశీల్దార్‌కు వినతి

ప్రజాశక్తి - తణుకు

దేశంలో ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు రక్షణ కల్పించి, మహిళలకు రక్షణ చర్యలు చేపట్టాలని ఆల్‌ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యకు నిరసనగా తణుకు బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ న్యాయవాదులు తణుకు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దారు వర్మకు మెమొరాండంని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌జికర్ మెడికల్ కాలేజీలో జరుగుతున్న అవినీతి బాగోతాలను వెలికితీస్తుందనే భయంతో జూనియర్ డాక్టర్ హత్య చేయడం దుర్మార్గమన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మహిళా, వైద్య ఆరోగ్య, హోం శాఖలను కూడా మమతా బెనర్జీ నిర్వహిస్తూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి పూర్తి రక్షణ ప్రభుత్వం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొండా శ్రీనివాసు, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, జి.అంబేద్కర్, అనుకుల రమేష్, డి.అప్పారావు, బివివి.విక్టర్‌బాబు, చింతపల్లి నాగేశ్వరరావు, గూడూరి సత్యనారాయణ, ఎం.ప్రభాకరరావు, కె.పురుషోత్తం, న్యాయవాద గుమస్తాలు సిద్ధేశ్వరరావు, రవీంద్ర పాల్గొన్నారు.

ఉండి: జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. మంగళవారం ఉండి పురవీధుల్లో శ్రీశశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఇండియన్ డిజిటల్ స్కూల్, పోలిమ్యాత్, గీతాంజలి, దివ్య జూనియర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల హత్యకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అదుపు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని, యువత వాటికి బానిసలుగా మారడం వల్ల రోజురోజుకీ అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ నిర్భయ వంటి చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని, దోషులను వెంటనే కఠినంగా శిక్షించి ఆ విద్యార్థిని కుటుంబానికి తగిన న్యాయం చేయాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రోహిత్, సాగర్, గోవింద్, మణిరత్నం, ప్రణీత్, ప్రకాష్, సూర్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని మానవహారం చేపట్టారు.

ఉండి : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థుల ర్యాలీ

భీమవరం టౌన్: జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కోల్‌కత్తా ఆర్‌జిఆర్ హాస్పిటల్ జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని భీమవరం నియోజకవర్గ కూటమి నేతల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) మాట్లాడుతూ కోల్‌కత్తా జూనియర్ డాక్టర్ హత్యపై విచారణ వేగవంతం చేయాలని, డాక్టర్‌పై అత్యాచారం అత్యంత దారుణమని, ఇలాంటి సంఘటలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ డాక్టర్‌కు న్యాయం జరగాలని, మరే ఆడబిడ్డకు అన్యాయం జరగకుండా ప్రజలు గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించిన యువత

సెల్‌ఫోన్ గ్రూప్ వేదికగా కదలిన యువత

ప్రజాశక్తి - ఆకివీడు

ఎన్నో ఏళ్లుగా ఆ సమస్యపై ఆ ప్రాంతవాసుల పోరాడారు. ఫలితం లభించలేదు. ఈ దశలో ఆ ప్రాంతంలో సెల్‌ఫోన్ రోడ్డు నిర్మాణానికి సహకరించిందంటే అది నిజం. ఊరి సమస్యపై కదిలిన యువత మూడు రోజులపాటు శ్రమదానం చేసి తమ రోడ్డు సమస్యను వారే పరిష్కారం చేసుకున్నారు. అందుకు అప్పటికే ఉన్న వాట్సాప్ గ్రూప్‌ను వేదికగా ఉపయోగించుకున్నారు. 'సమతానగర్ వాట్సాప్' అనే గ్రూప్ ద్వారా కలిసిన స్థానిక 17వ వార్డు సమతా నగర్ యువత ఒక సంఘంగా ఏర్పడ్డారు. వీరు స్వాతంత్ర దినోత్సవం నాడు తొలిసారి సంఘంగా ఏర్పడి ఆ ప్రాంతంలో సమావేశమయ్యారు. ఆ ప్రాంతంలో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రోడ్డు సమస్యను చర్చించారు. దానిని తొలి సమస్యగా ఎంచుకొని రోడ్డు పై ఉన్న గోతులను పూడ్చుకుని మురుగునీరు లేకుండా చేసుకోవాలని సంకల్పించారు. తమలో తాము ఎవరు శక్తి కొలది వారు డబ్బులు ఇచ్చి ఒక నిధిని ఏర్పాటు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. సమావేశానికి వచ్చిన యువత వెంటనే ఎవరికి తోచిన వితరణ వారు ప్రకటించారు. సంకల్పం మంచిది అయితే పదిమంది చేయూతనందిస్తారనది ఇక్కడ నిజమైంది. వారి సంకల్పానికి గ్రామంలో పెద్దలు, రాజకీయ నేతలు సహకరించారు. దీంతో ఉత్సాహంగా పనులు చేపట్టిన యువత మూడు రోజుల్లో సుమారు అర కిలోమీటరు రోడ్డును నిర్మించారు. నిర్మాణం అయితే పూర్తయింది కానీ వారి ప్రయత్నం వారికి ఆశ్చర్యం కలిగించింది. ఇది తొలివిజయంగా ఒకరినొకరు అభినందించుకున్నారు. ఆనందపడ్డారు. పలువురికి ఆదర్శంగా నిలిచారంటు యువత కృషిని పలువురు అభినందించారు.

రోడ్డును నిర్మించిన యువత

దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా కృషిచేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు కమిటీ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సమక్షంలో దేవాదాయ భూములు సంరక్షణపై జిల్లాస్థాయి ఇంటర్నల్ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థాన భూములకు సంబంధించిన 14 కేసులను తాత్కాలికంగా మినహాయించి, మిగిలిన కేసులకు సంబంధించిన భూములు స్వాధీనం చేసుకునేందుకు చర్యలు ప్రారంభించాలన్నారు. ఈ స్థలాల్లో పక్క గృహాలు, బ్యాంకు, విద్యుత్ సబ్ స్టేషన్ ఉన్నాయని ఎండోమెంట్ అధికారులు జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఎండోమెంట్స్, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలు క్షేత్రస్థాయిలో సందర్శించి నివేదికను తయారు చేయడంతో పాటు, భూమి అనుభవిస్తున్న వారితో మాట్లాడి రెండు వారాలలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, తాడేపల్లిగూడెం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ శివన్నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

బిఎల్‌ఒలకు పాత బకాయిలు చెల్లించాలి

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు

పెనుమంట్ర: రాష్ట్రంలో ఎన్నికల విధులను అవిశ్రాంతంగా నిర్వహించిన బిఎల్‌ఒలు అందరికీ చెల్లించాల్సిన పాత బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 64 వేల 165 మంది ఉన్నారని, బిఎల్‌ఒలుగా విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, ఇతర సిబ్బంది ఎంతో కష్టపడి ఓటర్ లిస్టులు నాలుగు సంవత్సరాల నుంచి తయారుచేయడం, వాటికోసం డోర్ టు డోర్ సర్వే చేయడం, స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లు సెలవు రోజుల్లో కూడా పాల్గొనడం జరిగిందన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి బిఎల్‌ఒలకు ఇవ్వాల్సిన గౌరవ వేతనం ఇవ్వకుండా, సాధారణ ఎన్నికల సమయంలో పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఏర్పాట్లు, ఇతర సదుపాయాలకోసం ఖర్చు పెట్టిన డబ్బులు కూడా ఇవ్వకుండా బిఎల్‌ఒలను ఇబ్బందులకు గురి చేయడం జరిగిందని వారు వాపోయారు. పాత బకాయిలు వెంటనే విడుదల చేయాలని వారు తెలిపారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

భీమవరం టౌన్: టెలికాం రంగంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విప్లవాత్మక మార్పు తెచ్చారని, దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం గునుపూడిలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు, ఎంఎల్‌ఎ అంజిబాబు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు పున్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ విగ్రహం కేవలం జయంతి, వర్ధంతులకు దండలు వేసి దండాలు పెట్టడానికి కాదని, మహానుభావుల విగ్రహాలు చూసినపుడు వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలన్న భావన మనకు కలగాలని అన్నారు. అందరికీ ఆదర్శంగా ఉండే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పున్ననిర్మాణం చేసుకోవడం గొప్ప విశేషమని అన్నారు. నాటి రాజీవ్ గాంధీ పాలనలో తీసుకున్న నిర్ణయాలు దేశంలో సాంకేతిక, టెలికాం రంగానికి బలమైన పునాదులు వేశాయని, తండాల నుంచి పట్టణాల వరకు ప్రజలు మొబైల్ ఫోన్లను ఉపయోగిస్తూ ఈరోజు ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకున్నారంటే దానికి రాజీవ్ గాంధీ పాలన సంస్కరణల ఫలితమే అని అన్నారు. దేశానికి రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయమన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యడ్ల శివాజీ అధ్యక్షతన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలుకులూరి అర్జున్ రావు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగించడమే లక్ష్యం

సర్పంచి శ్యామల స్వామి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ గ్రామపంచాయతీ ఏరియాలో గల కోడిపందేల దిబ్బ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు వీధిలైట్లు వేయిస్తున్నామని సర్పంచి శ్యామల సోని అన్నారు. మంగళవారం సర్పంచి శ్యామల సోని మాట్లాడుతూ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆదేశాల మేరకు స్వయంగా కోడి పందేల దిబ్బ ప్రాంతంలో గల ప్రతిచోట ప్రజల సౌకర్యార్థం లైట్లు వీధి విద్యుత్ దీపాలను వేయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యదర్శి టి.రత్నాకర రావు, డిఎమ్.మహంతి, పంచాయతీ సిబ్బంది, ఎలక్ట్రికల్ సిబ్బంది హాజరయ్యారు.

చిరంజీవి అభిమానుల రక్తదానం

నరసాపురం: చిరంజీవి, పవన్‌కళ్యాణ్ యువత, నరసాపురం వారి ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా సోమవారం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని నరసాపురం మాజీ ఎంఎల్ఎ బందారు మాధవ నాయుడు ప్రారంభించారు. అనంతరం మెగాస్టార్ చిరంజీవి, పవన్ కళ్యాణ్ అభిమానులు రక్తదానం చేశారు. రక్తదాతలకు మాజీ ఎంఎల్ఎ బందారు మాధవ నాయుడు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి కుటుంబసభ్యులు, మెగాస్టార్ అభిమానులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం టౌన్: పట్టణంలో వేంచేసియున్న మావుళ్ళమ్మ అమ్మవారికి భీమవరంకి చెందిన ఎ.నాగశివ సాయితేజ, మౌనిక దుర్గాసాయి వాసవి దంపతులు యాభై ఆరు వేల ఒక రూపాయి అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానానికి విరాళంగా సోమవారం అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే

నరసాపురం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా యుకెఎస్‌సి వనితా క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ బిలువాని సుబ్రహ్మణ్యేశ్వర కొమ్ము నాగేశ్వరరావుని సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, పశ్చిమగోదావరి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ రాయలక్ష్మి శిరినీడి హాజరై మాట్లాడుతూ ఫొటోగ్రాఫ్ సృజనాత్మకతను ప్రతిబింబించే కళ అని, ఆ కళను తమ జీవితాలకు అన్వయించుకున్న వీరిద్దరిని సన్మానించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి, కార్యదర్శి బండి నర్సింహ, ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషారాణి, సహాయ కార్యదర్శి తోట భారతి, సుంకర రాజకుమారి, మణి, తోట అరుణ, పద్మావతి, మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ సన్నిధిలో కలెక్టర్ నాగరాణి

భీమవరం : మంగళవారం భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారిని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకున్నారు. జిల్లా కలెక్టర్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, భాజా భజంత్రీలతో అంతరాలయానికి తీసుకొని వెళ్లారు. అనంతరం ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో మంత్రోచ్ఛారణ మధ్య ఆశీర్వచనాలు అందజేసి ప్రసాదాలు అందజేయగా ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ శేష వస్త్రం, అమ్మవారి ఫోటోను కలెక్టర్‌కు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి గణేష్, డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

70 మందికి కంటి వైద్య పరీక్షలు

ఆచంట: కొడమంచిలి పంచాయతీ పరిధి అరుంధతీపేట సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మంగళవారం ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రామకృష్ణ సిద్ధార్థ నర్సింగ్ బుద్ధుడు కంటి ఆసుపత్రి సహకారంతో సుమారు 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని డాక్టర్ టి.ఆనంద్ కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న సర్పంచి సుంకర సీతారామ్ మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో ఇటువంటి కంటి పరీక్షలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. అరుంధతీపేట గ్రామస్తులు మిగిలిన వర్గాల వారికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ క్యాంపులో పాస్టర్ పి.రత్నం, పెద్దలు కొండేటి వరప్రసాద్, పల్లేటి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

ఆచంట : మాలమహానాడు, ఎస్‌సి, ఎస్‌టి వర్గీకరణ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా నిరసన బంద్ నిర్వహించనున్నారు. ఈ బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని అంబేద్కర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర సీతారామ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొడమంచిలి పంచాయతీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారత్ బంద్‌కు సంఘీభావం తెలిపారు. మండలంలో ఉన్న ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారు, అన్ని విద్యాసంస్థలు, రవాణా సంస్థలు, ప్రభుత్వ ఆఫీసులు, వర్తక, వ్యాపారస్తులు, కాఫీ హోటల్స్, భోజన హోటల్స్, వారు సంబంధిత శాఖలను సహకరించాలని కోరారు.

మొగల్తూరు : ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ కు సహకరించాలని పివి రావు మాల మహానాడు నాయకులు వ్యాపారులను కోరారు. మండలంలోని మొగల్తూరులోని దుకాణాల వద్దకు వెళ్లి తమ ఉద్యమం గురించి వివరిస్తూ కరపత్రాలను అందించారు.

బాలికపై మహిళల దాడి

మనస్తాపంతో బాలిక ఆత్మహత్యాయత్నం

ఉండి: కలిగొట్ల గ్రామానికి చెందిన బాలికపై ఇద్దరు మహిళలు అకారణంగా దాడిచేసి దూషించడంతో మనస్తాపం చెందిన బాలిక టిన్నర్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. హాస్పిటల్‌లో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాల ప్రకారం మండలంలోని కలిగొట్ల గ్రామానికి చెందిన కాటికి లక్ష్మి అనే బాలికపై అదే గ్రామానికి చెందిన లక్ష్మీకాంతం, ఎస్తేరు రాణి అనే మహిళలు ఈనెల 18వ తేదీన దాడిచేసి అసభ్యకరంగా మాట్లాడడంతో మనస్తాపం చెందిన బాలిక తన ఇంట్లో ఉన్న టిన్నర్ తాగి అస్వస్థతకు గురి కావడంతో బాలికను భీమవరంలోని ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్తేరు రాణి, లక్ష్మీకాంతంలపై ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అవుట్‌లెట్ నిర్మించాలి

మొగల్తూరు : మండలంలోని కాళీపట్నం తూర్పులో డ్రెయిన్ సమస్య పరిష్కారం అయ్యింది. గ్రామంలోని 216 జాతీయ రహదారికి ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం చేశారు. దానికి అవుట్‌లెట్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ రెవెన్యూ అధికారులతో కలిసి గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. వెంటనే అవుట్‌లెట్ నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

వీరవాసరం : మండలంలోని రాయకుదురు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరమును ఏర్పాటు చేశారు. భీమవరం నియోజకవర్గ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి.సుధీర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రాయకుదురు ఎంపిటిసి సుమారు 80 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స చేశారు. వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంపిటిసి కడలి నెహ్రూ, సర్పంచి గెడ్డం భారతి పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు పనుల పరిశీలన

తాడేపల్లిగూడెం: ప్రత్తిపాడు సాక్షి ఆఫీస్ నుంచి బాదంపూడి వరకు వర్షాభావ పరిస్థితుల్లో పాడైన రోడ్లు మరమ్మత్తు పనులను మంగళవారం తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. గత వారం రోజుల క్రితం వర్షాల వల్ల రోడ్లు ఛిద్రమవడంతో రోడ్ల నిర్మాణానికి ముందు తాత్కాలిక మరమ్మతులు చేయాలని ఆదేశించిన పనులు ఎంతవరకు జరుగుతున్నాయో, వాటి నాణ్యతను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. తుఫాన్లు ఉన్న నేపథ్యంలో పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

దోమల నిర్మూలనపై అవగాహన

మొగల్తూరు : దోమల నిర్మూలనపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం అవగాహన ప్రదర్శన చేశారు. ప్రపంచ దోమల నిర్మూలన దినోత్సవ సందర్భంగా ఫ్లగాడ్లతో గ్రామంలో ప్రదర్శన చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు లక్ష్మీపార్వతి సూచించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

చెత్తాచెదారంతో నిండిన నక్కల కాలువ

ఆక్రమణకు గురవుతున్న నక్కల కాలువ

ప్రజాశక్తి - పెనుగొండ

నక్కల కాలవ ఆక్రమణకు గురై, గుర్రపుడెక్క, చెత్తాచెదారం పేరికిపోవడంతో వర్షాకాలం పంటలు ముంపు బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నక్కల కాలువ కాకరపర్రు నుంచి మొదలై బ్యాంక్ కెనాల్ వద్ద విడిపోయి పేకేరు మీదగా పెనుగొండ, కొటాలపర్రు, ఆచంట నుంచి లక్ష్మీపురం పాలెంలో కలుస్తుంది. ఇప్పుడు రైతులకు గోరుచుట్టు రోకలపోటులా తయారైందని రైతులు వాపోతున్నారు. పెనుగొండ పంచాయతీలోని డంపింగ్‌యార్డు నక్కల కాలువలో వేయడంతో బక్క చిక్కిపోంది. రోజూ రాష్ట్ర రహదారి పెనుగొండ నుంచి సిద్ధాంతం అనేక వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. డంపింగ్‌యార్డ్ దగ్ధం చేసినప్పుడల్లా పొగ కాలుష్యం, దుర్వాసన వెదజల్లుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని నక్కల కాలువ రైతులు కోరుకుంటున్నారు.

సార్వత్రిక విద్యాపీఠం అడ్మిషన్లపై అవగాహనా ర్యాలీ

పాలకొల్లు: పాలకొల్లు పట్టణ పరిధిలో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియపై మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పాలకొల్లు మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గుమ్మల్ల వీరస్వామి, ఎంఇఒ-2 ఆర్‌ఎన్‌ఎస్ విజి.శర్మ మాట్లాడుతూ మహిళలు, వివిధ రకాల వృత్తులు చేయు వారికి, వ్యాపార రంగంలో ఉన్న వారికి, వివిధ మహిళా సంఘాల వారికి అవగాహన కల్పించుటకు ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ఈ సార్వత్రిక విద్యాపీఠంలో 18 సంవత్సరాలు పైబడి మధ్యలో బడి మానేసిన వారు ఈ ఓపెన్ స్కూల్లో చదువుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎంకెఎన్‌ఎం మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎఎన్‌వి.సత్యనారాయణ, పివిఆర్ మాస్టారు పాల్గొన్నారు.

విద్యార్థులచే నృత్య ప్రదర్శన

నరసాపురం: విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆది పరాశక్తి నృత్య ప్రదర్శన జరిగింది. నాట్యాచారిని వలవల అనంతలక్ష్మి దేవి శిష్య బృందం 30 మందిచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కెఎస్.రామారావు వీక్షించి అభినందించారు. అనంతరం నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులకు ధృవపత్రాలను, జ్ఞాపికలను అందించారు.

బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహనా సదస్సు

పెనుమంత్ర : బాల్య వివాహాలు నిషేధ చట్టం-2006 పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని, వివాహ వయస్సు రాని వారికి వివాహం జరుగకుండా అడ్డుకోవడం చేయాలని ఎంపిడిఒ పి.పద్మజ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ హాల్‌లో జరిగిన ఐసిడిఎస్ సిబ్బంది, కార్యకర్తలకు నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చట్టం గురించి ప్రాజెక్ట్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అవగాహన కలిగించారు. ఎంఇఒ-2 యు.నాగేశ్వరరావు, మండలంలోని అంగన్వాడీ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో

పొలమూరు, మాముడూరు హై స్కూల్స్‌లో భేటీ బచావో భేటీ పడావో అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సూపర్వైజర్ ఎస్.వెంకటలక్ష్మి, డిసిపియు కౌన్సిలర్ సత్యనారాయణ, రీచ్ వర్కర్ స్వర్ణ, స్కూల్స్ ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాంజనేయరాజుకు సిపిఎం నేతల పరామర్శ

యలమంచిలి: టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామాంజనేయరాజు తండ్రి నరసింహ రాజు ఇటీవల మరణించిన నేపథ్యంలో సిపిఎం నాయకులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా సెక్రటరియేట్ సభ్యులు కవురు పెద్దిరాజు, సిపిఎం సీనియర్ నాయకులు కేతా సూర్యారావు, జిల్లా కమిటీ సభ్యులు కానేటి బాలరాజు, నార్ని త్రిమూర్తులు, మానవరపు సుబ్బారావు మంగళవారం రామాంజనేయరాజు స్వగ్రామమైన మండలంలోని ఏనుగువానిలంక పోలవరంలోని నివాసానికి చేరుకొని రామాంజనేయరాజును పరామర్శించిన అనంతరం నరసింహ రాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

ఉండి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు అందిస్తున్న సహకారం మరువరానిదని ఉండి మండలం పాందువ్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నోబుల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సత్యనారాయణ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే మెరిట్ విద్యార్థులకు దాతల సహకారంతో సుమారు రూ.50 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ఉపాధ్యాయుడు చక్కటి విద్యను బోధించడమే కాకుండా విద్యార్థులు సన్మార్గంలో నడిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం పాఠశాలలో చదివే విద్యార్థులకు రూ.3 వేల నగదు బహుమతి ఇచ్చినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలికల పట్ల వృద్ధుడి అనుచిత ప్రవర్తన

వీరవాసరం: వీరవాసరం మండలం మత్స్యపురి హైస్కూల్‌కు చెందిన కొంతమంది బాలికల పట్ల ఆ గ్రామానికి చెందిన ఒక వృద్ధుడు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నట్లు ఆలస్యంగా తెలిసింది. కాకినాడకు చెందిన పడాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వేచ్ఛ ఫర్ లిటిల్ బర్డ్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. లైంగిక వేధింపులకు గురవుతున్న బాలికలను రక్షించే లక్ష్యంగా ఈ సంస్థ పనిచేస్తుంది. ఇటీవల కొద్దికాలంగా ఈ సంస్థ పలు హైస్కూల్స్‌లో లైంగిక వేధింపులపై బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈవిధంగా కొద్దిరోజుల క్రితం మత్స్యపురి హైస్కూల్‌లో కూడా ఈ సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా లైగింక వేధింపులకు గురవుతున్న వారు తమ అభిప్రాయాలను రాసి సీక్రెట్ బాక్సులో వేయడం జరిగింది. ఈ విధంగా నలుగురు విద్యార్థినీలు తాతాయ్య అంటూ రాసి సీక్రెట్ బాక్సులో వేయడం జరిగింది. తాతాయ్య అని ఎందుకు రాసారంటూ ఆరా తీయగా ఆ వృద్ధుడు బాలికల పట్ల అభ్యంతరకరంగా ప్రర్తిస్తున్నట్టు తెలుసుకున్నారు. ఈ విషయం వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్ళినా వారి పరువుపోతుందని వృద్ధుడుపై చర్యలు తీసుకోవడానికి ముందుకు రాలేదని సమాచారం. హైస్కూల్‌కు ఎదురుగా ఉండే వీధిలోనే తన ఇంటి వద్దే ఈ వృద్ధుడు హైస్కూల్‌కు వచ్చే బాలికలను పిలిచి అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నట్టు సమాచారం.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా జనసేన పనిచేస్తుందని, ఇందులో భాగంగానే జనవాణి కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. తీర ప్రాంత గ్రామం బియ్యపు తిప్పలో మంగళవారం రాత్రి నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. జనసేన నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ఉండి: పాములపర్రు, వెంకట రాజపురం, కోలమూరు గ్రామాల ప్రజలకు ఉండి, పాములపర్రు పంట కాలవ నుంచి సాగు, తాగునీరు అందించేందుకు అవసరమైన పంటకాలవ పూడిక పనులను జనసేన మండల అధ్యక్షులు, పాములపర్రు ఎంపిటిసి యడవిల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఉండి పంట కాలువ నుంచి వెళ్లే నీటి వల్ల సుమారు 3 వేల మంది ఆధారపడి ఉన్నారని, అంతేకాకుండా వ్యవసాయ రైతులు కూడా ఆధారపడి ఉన్నారని అన్నారు. కానీ ఈ కాలువను ఆనుకుని కొంతమంది ఆక్రమణలు చేశారని, దీనివల్ల ఆయా గ్రామాలకు స్వచ్ఛమైన నీరు వెళ్లేందుకు మార్గం లేకపోయిందన్నారు. దీంతో ఆ గ్రామాల ప్రజలు అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధులు చుట్టూ ఏళ్ల తరబడి తిరిగినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. పాములపర్రు ఎంపిటిసి వెంకటేశ్వరరావు ద్వారా విషయం తెలుసుకున్న తాను 20 మంది వల్ల సుమారు 3 వేల మంది ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో అవసరమైన చోట ఆక్రమణలు తొలగించేందుకు వారికి అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకునేలా ఆక్రమణదారులతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. అనంతరం టిడిపి మండల ఉపాధ్యక్షులు పేరిచర్ల బాలకృష్ణ రాజు మాట్లాడుతూ ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదని ఇటువంటి ఎంఎల్ఎ ఉండి నియోజకవర్గానికి రావడం తమ అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాములపర్రు సర్పంచి కేసన శాంతికుమారి బలుసులరావు, నాయకులు తోట శ్రీరాములు, కేశన యాదగిరి, వర్రే సముద్రమూర్తి, గురుగుబిల్లి సత్యనారాయణ, కరిమెరక శ్రీను, బిజెపి మండల అధ్యక్షులు యర్రా విక్రమ్, నాయకులు కొమ్మన నాగబాబు, గాదిరాజు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

కొనసాగిన శిక్షణా తరగతులు

ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి - కాళ్ల

సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్క్ కంపోస్ట్‌పై ప్రతిఒక్కరూ దృష్టిసారించి పంచాయతీలకు ఆదాయాన్ని పెంపొందించాలని ఎంపిడిఒ జి.స్వాతి అన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ పాలనపై మంగళవారం రెండో రోజు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో పలు అంశాలపై వారికి అధికారులు అవగాహన కల్పించారు. ఏలూరుపాడు గ్రామంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రానికి తీసుకువెళ్లి గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి వాటి నుంచి సంపద తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యటన, పారిశుధ్యం తదితర అంశాలపై డిపిఆర్‌సి.రామలక్ష్మి, ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావులు అవగాహన కల్పించారు. కాళ్ల మండలపరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికలు, పరిశీలనా విధానం, వీధి లైటింగ్, పంచాయతీలలో ఎలక్ట్రిసిటీ బిల్లులు తదితర అంశాలపై కార్యదర్శులకు, సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు దొంగ సత్యనారాయణ, బి.సతీష్ కుమార్, ఎస్.అరుణ దేవి, డి.సునీల్ రాజు పాల్గొన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీ

ఉండి: ప్రజలందరూ శాం తిమార్గంలో పయనిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కో కన్వీనర్ కొమ్మన నాగబాబు అన్నారు. మంగళవారం ఉండి మెయిన్ సెంటర్‌లో మానవత మండల అధ్యక్షులు పెన్మెత్స రామకృష్ణంరాజు అధ్యక్షతన ఉండి పురవీధుల్లో ప్రపంచ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొమ్మన నాగబాబు, మాజీ అధ్యక్షులు దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శాంతిమార్గంలో పయనిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పరిసరాలను పరిరక్షించిన వారవుతారన్నారు. మండల విస్తరణాధికారి మండా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇతరుల పట్ల సహనం, ఓర్పు వహించాలని, హింస ప్రవృత్తిని ప్రతిఒక్కరూ విడనాడాలన్నారు. మానవతా ఉండి కార్యదర్శి డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ మానవతా ఆవిర్భావం దినోత్సవం పురస్కరించుకుని గత ఆరు సంవత్సరాల నుంచి వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రపంచ శాంతి ర్యాలీ చేయడం జరుగుతుందని, గత ఆరు సంవత్సరాల్లో 500 శాఖలకుపైగా విస్తరించిన మానవతా, ఇతర స్వచ్ఛంద సేవా సంస్థలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలో తొమ్మిది ఫ్రీజర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని, కావాల్సిన వారు వీటిని వినియోగించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సత్యనారాయణ, సంస్థ సభ్యులు యర్రా విక్రమ్, రాయి రాములమ్మ, గాదిరాజు వెంకటేశ్వరరాజు, రంగ ప్రసాద్ రాజు, దివ్య కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

అమ్మారావు

నవీన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం పాలకోడేరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దొడ్డిపట్ల అమ్మారావు, తలుపురి నవీన్, ఉపాధ్యక్షులుగా మల్లిపూడి వెంకటేశ్వరావు నియమితులయ్యారు. అలాగే మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వద్దిపర్తి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కమిటి సభ్యులు యండమూరి సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకులకు రక్షణ చట్టం కల్పించాలన్నారు. రజకులు కుల వివక్షలకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక గ్రామాల్లో చెరువులు ఆక్రమాలకు గురి అవుతున్నాయన్నారు. చెరువులు సర్వే చేసి రజకులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం!

తాడేపల్లిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరికి నడిబొడ్డున ఉన్న తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చిందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడతూ సిఎం చంద్రబాబునాయుడు ఇటీవల ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోయే పది విమానాశ్రయాలపై ఆ శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో చర్చించామన్నారన్నారు. విమానాశ్రయం ఏర్పాటు చేయాలంటే వెంకట్రామన్నగూడెం వద్ద అటవీ, రెవెన్యూ భూములు అక్కరకు రానున్నాయన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం నుంచి వెంకట్రామన్నగూడెం వరకు నాలుగు లైన్‌ల రహదారి విస్తరించిందని, భీమవరం నుంచి తాడేపల్లిగూడెం వరకు జాతీయ రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. తాడేపల్లిగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని, భవిష్యత్తులో ఏపీ నిట్ విస్తరణతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

భీమవరం టౌన్: భీమవరంలోని బివి రాజు మున్సిపల్ పార్కు చుట్టూ ఆక్రమణలకు గురికాకుండా చూస్తామని, ఆ ప్రాంతాన్ని సుందరీకరణ చేయాలని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బివి రాజు మున్సిపల్ పార్క్ పరిసర ప్రాంతాలను ఎంఎల్ఎ, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన మున్సిపల్ పార్క్ పరిసరాలను సుందరీకరణ చేసి పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రి తనిఖీ

తణుకు : పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో వైద్యుల నిర్లక్ష్యం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఒపి విభాగాలు, అత్యవసర వైద్య విభాగం, ప్రసూతి వార్డు, మందుల నిల్వ కేంద్రం, ల్యాబ్, స్కానింగ్ ఎక్సరే యూనిట్లను పరిశీలించి సంబంధిత వైద్యులకు సూచనలు ఇచ్చారు. గర్భిణులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రసవాలు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న సేవలను, ఒపి విభాగం హాల్లో రోగులు కూర్చోవడానికి ఇబ్బంది లేని విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, తణుకు మున్సిపల్ కమీషనర్ బివి.రమణ, డిఇ.కె ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

24న క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు : పాలకొల్లు ఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికార్టే సొల్యూషన్స్ ప్రైవేట్ లి, హైదరాబాద్ కంపెనీలో జూనియర్ సాఫ్ట్వేర్ ఇంజినీర్, జూనియర్ సాఫ్ట్వేర్ అసోసియేట్, ట్రైనీ పోస్టులకు ఈనెల 24న (శనివారం) క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఇంటర్వ్యూ, నియామకాలు నిర్వహించ బడునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి తెలిపారు. ఈ పోస్టులకు జావా, నెట్ టెస్టింగ్, పైథాన్ లేక డేటా సైన్స్‌లో నైపుణ్యం కలిగి ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలిగి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన, ఆఖరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు హాజరవ్వాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P.No 48/2019 in OS. No.116/2015

బిట్వీన్
పడాల వెంకట రామారెడ్డి ...డిక్రీ హోల్డర్
Vs
1. లోపింటి సింహాచలం
2. లోపింటి శ్రీనివాసరావు
3. లోపింటి సత్య వరప్రసాద్
4. లోపింటి మధుసూదనరావు
5. లోపింటి బంగారమ్మ ...జడ్జిమెంట్ డేటార్టు

1. లోపింటి సింహాచలం, S/o.చిన్నయ్య, వ: 44 సం.రాలు పురుషుడు, వ్యాపారం, వేలమగుడెం, పాలకొల్లు
2. లోపింటి శ్రీనివాసరావు, S/o.చిన్నయ్య, వ : 44 సం. రాలు పురుషుడు, వ్యాపారం, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొల్లు
3. లోపింటి సత్యవరప్రసాద్, S/o.చిన్నయ్య, వ: 40 సం.రాలు పురుషుడు, వ్యాపారం, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొల్లు
4. లోపెంటి మధుసూదనరావు, S/o.చిన్నయ్య, వ: 34 సం.రాలు, పురుషుడు, వ్యాపారం, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొల్లు
5.లోపింటి బంగారమ్మ, W/o.చిన్నయ్య, వ: 66 సం.రాలు, స్త్రీ, గృహిణి, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొలు

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేటార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది 09-09-2024వ తేదీన ఉ.గం.10.30ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించ బడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్-రిజిష్టారులో చేరిన పాలకొల్లు మండలం, పాలకొల్లు మున్సిపల్ లిమిట్స్, మండేలవారి తోటలో గల TS.No. 424/2లో 145 చ.గ. స్థలము, దానిలో గల డోర్. నెం. 45-3-46/1 గల RCC రూఫ్ భవనమునకు హద్దులు.
తూర్పు : నామాని లక్ష్మీకాంతం గారి స్థలం
పడమర: లోపింటి బంగారమ్మ గారి ఇంటి స్థలం
దక్షిణము: మెయిన్ స్ట్రీట్
ఉత్తరం : బోది
అమీనా విలువ = Rs.14,00,000/-
DHR విలువ = Rs.5,00,000/-
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకట రామిరెడ్డి**
ది.19/8/2024 అడ్వకేటు

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, 31వ వార్డు, డోర్‌నెం.1-8-5/2 చెందిన సోమంచి V.S.K.చైతన్య, S/o.S.V.S.K.సూర్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం.L5192355 మా ఇంటి వద్ద నుండి పెద్ద తాడేపల్లి రోడ్డు సమీపంలో నా మోటార్ సైకిల్ పై వెళ్లుచుండగా మార్గం మధ్యంలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : **సోమంచి V.S.K.చైతన్య,**
S/o.సూర్యనారాయణ,
బాపూజీనగర్, తాడేపల్లిగూడెం,
పశ్చిమ గోదావరి జిల్లా. సెల్: 93908 74694

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P.No.123/2014 in OS. No.186/2007

బిట్వీన్
ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి ...డిక్రీ హోల్డర్
Vs
గుబ్బల చిట్టిబాబు ...జడ్జిమెంట్ డేట్టార్టు
గుబ్బల చిట్టిబాబు, S/o.వెంకట నరసయ్య
మల్లవరం లంక, మల్లవరం,
నరసాపురం మండలం.

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేట్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది 05-09-2024వ తేదీన ఉ.గం.10.30ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.
Item No.1 పశ్చిమ గోదావరి జిల్లా. నరసాపురం సబ్-రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, మల్లవరం గ్రామం లోని RS.no.454/2లోగల య.1.00 సెంట్లు స్థలం దాని హద్దులు.
తూర్పు : గుబ్బల శ్రీనివాస్ గారి ఇల్లు గుబ్బల చిట్టిబాబు గారి ఇల్లు, పడమర : కౌరు వెంకటరావుగారి స్థలం, దక్షిణము: డ్రైనేజ్ కెనాల్, ఉత్తరం : ఇరిగేషన్ కెనాల్
ఈ హద్దుల మధ్య య.1.00 సెంట్లు స్థలం మరియు అందులో గల ఫలవృక్షములు లీజుమెంటు హక్కులతో సహా
అమీనా విలువ Item.No.1 = Rs.4,00,000/-
DHR విలువ = Rs.2,13,541/-
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకట రామిరెడ్డి**
ది.17-8-2024 అడ్వకేటు

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR JUDGE: RANGA REDDY DISTRICT AT: L.B. NAGAR
O.S. No. 510 of 2022

Between:-
'M/s. Mahesh Fats & Oil Limited' ...**Plaintiff**

AND

1. M/s. Nexus Well – Hope Agritech International Limited, Rep by its Director, Goluguri Radha, Having its registered office at: Plot No. 62, Survey No. 137, Nagole Village, Mamatha Nagar Colony, Nagole Hyderabad.
2. Mrs. Goluguri Radha, Additional Director: M/s. Nexus Well – Hope Agritech International Ltd, R/o. F-8, Shiridi Sai Apt, Bhimavaram, West Godavari, A.P.
3. Mr. Goluguri veera Venkata Naga Satya Prabha, Director M/s. Nexus Well – Hope Agritech International Ltd, R/o. H. No. 26-8-28, Shiridi Sai Apt, 2 nd Floor, S-1, Bhimavaram, West Godavari District, A.P.

...**Defendants**

NOTICE

Please take notice that the above named Plaintiffs have filed the above suit for recovery of money, and the same is posted on 03-09-2024. You are required to appear before the above said Hon'ble court either in person or through Advocate on 03-09-2024 at 10.30 A.M. failing which you will be set exparte and the matter will be decided on the material available.

By the Order of the Court
Pawan Kumar Agarwal
Advocate
Counsel for the Plaintiff
Phone: 9246530236

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT NELLORE
(Application for reference of a Dispute)
DISPUTE NO.153 Of 2022

Between:
M/s.Kapil Chits (Kosta) Pvt.Ltd., ------- Disputant
Vs
Mr.Kantam.Chandra Sekhar, And Others ------- Opponents

Notice to Opponents 1 To 5
1) Mr.Kantam.Chandra Sekhar S/o. Satyanarayana , Aged about 34 Years, Occ:Trainee Officer, SBI, Chinnapendiyal. R/o. D.No:6-17-12,Dasari Bairagi Street, Thuni(Vi), East Godavari D.t
2) Mr.Mutturu.Satya Narayana S/o. Pedda Subbarao, Aged about 67 Years, Occ:Retired postman, Penioner, R/o.D.No.2-95, A.V Narayana, Thondangi, East Godavari Dist
3) Mrs.Chintamneni.Mathaji D/o. Ramasatyanarayana, Aged about 34 Years, Occ: Asst Manager, APGVB, Peddagummuluru R/o.D.No.9-244/11/1, Indira Colony,Tuni(Vi), Visakapatnam Dist.
4) Mr.Garimella.Surya Narayana Visweswara Pradeep Kumar, S/o. Yagneswara Somayajula Sarma, Aged about 34Years, Occ:SWO-III,SBI Main Branch, Palvancha, R/o.Plot.No. AA2, Madhyam, Behind Dr. Jeelani Hospital, Palvancha, Khamam Chavali Vari Street, Gandhi Nagar, East Godavari dt
5) Mr.Pothamsetti. Nagendra, S/o. Rajababu, Aged about 26Years, Occ: Asst Manager, TGB, Bellampalli, R/o.Flot No:3-31A, Artlakota, Mangavaram, Visakapatnam Dist.

పై నెంబరున Disputant మీ మీద చీట్ బాకీ మొత్తము రాబట్టుకొనుటకు పైన తెలిపిన డి.ఆర్. ఆఫీస్ మీకు డి.సి.పి No 153 of 2022 నోటీసు నిమిత్తము తేది 30-08-2024 వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 11-00 గం. లకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పైన తెలిపిన డి.ఆర్. ఆఫీస్లో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది, లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడమైనది.
(By order of the Honourable Deputy Registrar)
Date: 30-08-2024 Advocate Nellore.